


గోనుగుంట మురళీకృష్ణ

# మనసు బరువు

అప్పుడే బజారు నుంచీ వచ్చి మెట్ల పక్కన సందులో బండి ఆపి స్టాండు వేస్తుంటే ఇంట్లో నుంచీ మా ఆవిడ పెద్దగొంతుతో అరవడం వినిపించింది. లోపలకి వచ్చాను. వరండా తలుపు దగ్గర, కింద కూర్చుని ఉంది అమ్మ.

"మీ గది వదిలి బయటకి రావద్దని ఎన్నిసార్లు చెప్పాను? శుచీ, శుభ్రం లేదు. మీ బట్టలు ఉతకటానికి పనిమిషి కూడా చిరాకు పడుతూంది వెళ్లండి" అంటూంది మా ఆవిడ.

"నానమ్మా! వెళ్లి ఫో!" తల్లి కొంగు పట్టుకుని చూస్తున్న ఎనిమిదేళ్ల నా సుపుత్రుడు అన్నాడు ముక్కు మూసుకుంటూ.

అమ్మ వెళ్లనన్నట్లు తల అడ్డంగా ఊపింది.

"ఏమండీ! మీ అమ్మగారిని వెనకవైపు గదిలోకి వెళ్లమని చెప్పాడు. ఆమె వల్ల పిల్లలకు కూడా ఇన్ఫెక్షన్ వస్తుంది" అన్నది.

నాకు కూడా అక్కడ వ్యాపించిన దుర్వాసన భరించటం దుర్భరంగా ఉంది.

"అమ్మా! నీ గదిలోకి వెళ్లు" అన్నాను.

అమ్మ నా వంక గాజుకళ్లతో ఒక్క క్షణం చూసి, లేచి వెనుదిరిగింది. అమ్మ జుట్టంతా తెల్లబడిపోయి పీచులా ఉంది. కాళ్లు, చేతులు సన్నబడిపోయి పుల్లల్లా ఉన్నాయి. భుజాల దగ్గర ఎముకలు కనపడుతున్నాయి. భుజంమీద క్రిందికి జారిపోతున్న జాకెట్ పైకి లాక్కుంటూ చిన్నగా వెళుతూంది. ఆ వెళ్లటంతో అంతులేని వంటరితనం, నిర్వేదం కనిపిస్తోంది.

నా మనసంతా ఏదో ఆవేదన చుట్టేసింది. అలసటగా సోఫా చేతి మీద తలపెట్టుకుని పడుకున్నాను. మా ఆవిడ అమ్మ కూర్చున్న చోట డెట్టాల్‌తో కడిగేసి, ధూప్ స్టిక్స్ వెలిగించింది.

నేను టెంత్ క్లాస్ చదివేటప్పుడు అమ్మ ఎంత అందంగా ఉండేది? ఉదయాన్నే తలారా స్నానం చేసి, తలకి తెల్లటి టవల్ చుట్టుకుని, కుంకం బొట్టు పెట్టుకుని, మడి కట్టుకుని దేవాలయంలోని నూతి దగ్గరకు నీళ్లకోసం వెళితే వీధిలో అందరూ గౌరవంగా పక్కకు తొలగి దారి ఇచ్చేశారు.

మడిగా వంట చేసి, దేవుడికి నైవేద్యం పెట్టి నాకు, అన్నయ్యకూ క్యారేజీలలో సర్ది, తొమ్మిదింటికల్లా సిద్ధం చేసేది.

ఆల్బంలో పెళ్లి ఫోటోలు చూస్తూ నాన్న "మహానటి సావిత్రి అంత అందంగా ఉన్నావోయ్ నువ్వు. కాకపోతే కొంచెం సన్నం" అనేవారు.

"చాల్లెండి సరసాలు. అవతల పిల్లలున్నారు. వింటారు" అనేది అమ్మ సిగ్గుగా.

నాన్నగారు చనిపోయినప్పుడు, అంత అన్యోన్యంగా ఉండే నాన్న, అమ్మని వదిలేసి వెళ్లిపోయారేమిటి? అని ఆశ్చర్యంగా అనుకునేవాడిని. దగ్గరి మనుషులు పోగా చూడటం అదే మొదటిసారి నాకు.

నాన్నగారు పోయిన తర్వాత కొంత కాలం పాటు బాగానే ఉంది అమ్మ. రాను రాను డల్‌గా అయిపోయింది. దానితో పాటు షుగర్, బి.పి., గుండెజబ్బు తోడయినాయి. అన్నయ్యకు, నాకు ఉద్యోగాలు వచ్చి పెళ్లిళ్లు అయ్యాయి. వదిన, నా భార్య కూడా ఉద్యోగస్తులే.

ఈ రోజుల్లో జబ్బుతో ఉన్న పెద్దవాళ్లను చూసే ఓపిక, తీరిక ఎవరికీ ఉండవు. పోనీ పనివాళ్లను పెడదామంటే సిటీలో మామూలు పనులు చేసే వాళ్లే దొరకరు. ఇక జబ్బు మనుషులను చూసే వాళ్లు ఎక్కడ దొరుకుతారు?

అమ్మని వృద్ధాశ్రమంలో చేర్పిద్దామని అన్నాడు అన్నయ్య. వెళ్లి కనుక్కొని వచ్చాడు. పదివేలు డిపాజిట్ కట్టాలట. నెలనెలా నాలుగు వేలు కట్టాలట. ఆ ఆశ్రమంలో ఉండేవాళ్లు ఎవరి పనులు వాళ్లు చేసుకోగలిగి ఉండాలి అని అక్కడి నిబంధనలు చెప్పారు. అవన్నీ వింటుంటే, ఆశ్రమం అంటే మనం సినిమాల్లో చూసినట్టు సేవాభావంతో ఉండరు. అది కూడా బ్రతుకుతెరువుకి ఒక మార్గం అనిపించింది.

పోన్లే! ఆమాత్రం చూసేవాళ్లు ఇంట్లో ఎవరూ లేరుగా! భార్యాభర్తలిద్దరికీ ఉద్యోగాలు. పిల్లల చదువులు చూడాలి. బిజీలైఫ్! నాకు మనసులో అయిష్టంగా ఉన్నా, పైకి ఏమీ అనలేకపోయాను. అన్నయ్య పదివేలు డిపాజిట్ కట్టి, ఎంతో న్యాయంగా, బాధ్యతగా వ్యవహరించినట్లు సంతోషించాడు.

ఆశ్రమం నుంచీ చీటికీ మాటికీ ఫోన్లు వచ్చేవి. అమ్మ భోజనానికి పిలిచినా రావటం లేదట. ఉదయాన్నే ప్రేయర్ చేయటం లేదు. మెడిటేషన్ చేయటం లేదు. స్నానం కూడా రెండు రోజులకి ఒకసారి చేస్తూంది... ఇలా అనేక కంప్లైంట్లు చెప్పి, నెల తిరక్కుండానే ఇంటికి పంపించివేశారు.

అన్నయ్య దగ్గర కొన్నాళ్లు, నా దగ్గర కొన్నాళ్లు అమ్మని ఉంచుదామనుకున్నాను. "చూస్తూనే ఉన్నావుగా! మీ అన్నయ్యకి ఎప్పుడూ క్యాంపులు. నాకు రాత్రి ఎనిమిదింటి వరకు బ్యాంకులో వర్క్ ఉంటుంది. ఇంటికి వచ్చిన తర్వాత కూడా రెండు మూడు గంటలు ఇంటి పని ఉంటుంది. నాకు ఎలా వీలవుతుంది?" అన్నది వదిన.

అమ్మని నా ఇంట్లోనే ఉంచేశాను. ఆమెను చూసుకోటానికి పనిమనిషిని మాట్లాడాను. నేను, నా భార్య ఇల్లు అప్పగించి ఉద్యోగాలకు వెళ్లిపోయే వాళ్లం. మావాడు స్కూల్‌కి వెళ్లేవాడు.

అమ్మకి మనసు చురుకుగానే ఉన్నా శరీరం మీద కంట్రోల్ పోయింది. మలమూత్రాలు పక్కలోనే జరిగిపోయేవి. పనివాళ్లు కూడా చిరాకు పడేవాళ్లు. ఇల్లంతా కంపుకొట్టిపోయేది. మా ఆవిడ కూడా "ఈ బాధ పడలేను. పుట్టింటికి వెళ్లిపోతాను" అని బెదిరించేది.


ఇక చేసేది లేక ఇంటి వెనుక వైపు ప్రత్యేకంగా ఒక గది కట్టించాను. పనివాళ్లు ఎంతో మంది మారిపోయారు. టైంకి భోజనం, మందులు నేనే ఇచ్చి వచ్చేవాడిని. అమ్మ వంటరిగా ఉండలేక మాటిమాటికీ ఇంట్లోకి వచ్చేది. వచ్చీ రాగానే మా ఆవిడ "మీ గదిలోకి వెళ్లండి" అనేది. ఇంటికి చుట్టాలు వచ్చినప్పుడు ఆమె రాకకి మరీ ఇబ్బంది పడిపోయేది. అమ్మ రావటం క్రమక్రమంగా తగ్గించివేసింది. ఇంటి వెనకాల గదిలోనే వంటరిగా ఆలోచిస్తూ ఉండిపోయేది.

మళ్లీ ఇన్నాళ్ల తర్వాత వచ్చింది. అమ్మ ఆకారం చాలా మారిపోయింది. చిక్కిపోయి, కళ్లు గుంటలు పడి పిచ్చిదాని ఆకారం వచ్చేసింది.

"టీ తీసుకోండి" మా ఆవిడ అందించింది.

సోఫాలో పడుకుని ఆలోచిస్తూ కళ్లు మూసుకున్న నేను ఉలిక్కిపడి కళ్లు తెరిచాను. టీ అందుకున్నాను.

ఆ మర్నాడు ఆదివారం. ఉదయం ఎనిమిది గంటలయింది. మావాడు డైనింగ్ టేబుల్ దగ్గర టిఫిన్ తింటున్నాడు. మా ఆవిడ బాక్స్‌లో ఇడ్లీలు పెట్టి, అమ్మకి ఇవ్వమని చెప్పింది. అది తీసుకుని ఆమె గదికి వెళ్లాను. గది తలుపులు దగ్గరకు వేసి ఉన్నాయి. నెట్టి చూశాను. రాత్రి వేసిన లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఫ్యాన్ తిరుగుతూనే ఉంది. అమ్మ నోరు తెరచుకుని ఉంది. నోటి చుట్టూ





ఈగలు వాలుతున్నాయి. చూడగానే అర్థమైపోయింది.

అయినా డాక్టర్‌కి ఫోన్ చేశాను. డాక్టర్ వచ్చి చూసి, ప్రాణం పోయి ఐదారు గంటలు అయింది అని చెప్పాడు.

బంధువులందరికీ కబురు వెళ్లింది. అందరూ వచ్చారు. అందరం కలిసి అమ్మని సాగనంపేశాము. బంధువులు రకరకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. సానుభూతి చూపిస్తున్నారు. కానీ నా మనసు మాత్రం మూగబోయినట్లుంది.

అమ్మ నలుగురిలో ఉండాలని, సాటిమనిషి తోడు కావాలని ఎంత తపించిపోయేదో కళ్లారా చూశాను. కానీ ఇంట్లోకి రాగానే "వెళ్లు, వెళ్లు" అని అందరం అనేవాళ్లం. మళ్లీ గుహ లాంటి ఆ గదిలోకి, ఏకాంత వాసంలోకి వెళ్లిపోయేది. రోజుల తరబడి వంటరిగా ఉండటం వల్ల, తన ఉనికిని ఎవరూ ఇష్టపడకపోవటం వలన అంతర్లీనంగా బ్రతకాలనే ఇచ్ఛ తగ్గిపోయి ఉండి ఉంటుంది. వంటరితనం మనకు తెలియకుండానే రాయి లాంటి గుండెనైనా బలహీనపడేటట్లు చేస్తుంది. అందుకే పెద్ద పెద్ద నేరగాళ్లను జైల్లో వంటరిగా బంధిస్తారు.

ఒక్క ఆత్మీయ స్పర్శ, ఒక్క చల్లటి మాట కొండంత ఓదార్పుని, ధైర్యాన్ని ఇస్తాయి. వర్షాకాలం ఈదురుగాలి వీచేటప్పుడు, మావాడు చిన్నప్పుడు వాణ్ని మధ్యలో పడుకోబెట్టుకుని డబల్‌కాట్ మీద నేను, నా భార్య వెచ్చటి రగ్గు కప్పుకుని పడుకునే వాళ్లం. ఒకరి స్పర్శ ఒకరికి ధైర్యాన్ని, సెక్యూరిటీని కలిగించేవి. అందుకే కాబోలు కుక్క పిల్లలు కూడా ఒకదానినొకటి ఆనుకుని గుంపుగా పడుకుంటాయి.

ఆ సమయంలో అమ్మ ఒక్కతే చీకటి గదిలో, చలిలో వంటరిగా ఉన్నదన్న ఆలోచనే వచ్చేది కాదు. అమ్మకి ఆత్మీయ స్పర్శ లేదు కదా. కనీసం నలుగురిలో మసలే అవకాశం కూడా కల్పించలేదు. లేకపోతే ఇంకా కొంత కాలం బ్రతికేదేమో! నా ఆలోచనలు సాగిపోతున్నాయి.

అన్నయ్య, బంధువులకి అమ్మ కోసం ఎంత ఖర్చు చేసిందీ, ఎంత మంది డాక్టర్లకి చూపించిందీ చెప్తున్నాడు. ఆయన మాటల్లో 'నా తప్పేం లేదు' అన్న భావం వ్యక్తమవుతుంది.

"నిజమేలెండి. మీ శాయశక్తులా చేశారు. భగవంతుడు ఆమెకి అంత వరకే ఆయుష్షు ఇచ్చాడు. ఏం చేస్తాం?" అన్నాడు ఒకాయన.

అన్నయ్య ముఖంలో సంతృప్తి కనిపించింది. వదిన, మా ఆవిడ మొదట విచారంగా కన్పించినా, ఇప్పుడు నెత్తి మీద నుంచీ కొండంత బరువు దిగిపోయినట్లుగా రిలీఫ్‌గా ఉన్నారు.

నా మనసు మాత్రం అపరాధ భావంతో కుంగిపోతున్నట్లుగా ఉంది.

○